క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 15, వంకాయ 18, బెండ 32, పచ్చి మిర్చి 35, కాకర 35, బీర 35, క్యాబేజీ 8, ఫ్రెంచిబీన్స్ 75, క్యారెట్ 18, దొండ 18–28, చిక్కుడు 55, గోకర 35, బీట్‌రూట్ 15, క్యాప్సికం 41, ఆలుగడ్డ 26, దోస 18, సొరకాయ 9, పొట్లకాయ 18, ఉల్లి గడ్డ 17, చామగడ్డ 35లుగా ఉన్నాయి.
గమనిక: ఈ ధరలు మంగళవారం ఉదయం 9గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

షాదీముబారక్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్‌పేట: పేదల వివాహాలకు ప్రభుత్వ పరంగా ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ఎల్లప్పుడు తన సహకారం ఉంటుందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం చార్మినార్, అంబర్‌పేట మండలాల పరిధిలోని 136 మంది లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ డిప్యూటీ తహసీల్దార్ మన్సూర్ అలీ, అంబర్‌పేట మండల ఆర్‌ఐ సంతోష్, మహ్మద్ రిజ్వాన్, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రెడ్డి



మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గంగుల వెంకటేశ్వర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ గౌరవ చైర్మన్, మూసారంబాగ్ మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా స్వామిగౌడ్, ఉపాధ్యక్షులుగా ఎంఎస్‌రావు, వెంకన్న, ప్రధానకార్యదర్శిగా సింగిరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రామకృష్ణ, జాయింట్ సెక్రటరీలుగా బీఎస్‌రాజు, చలపతి, కోశాధికారిగా చంద్రశేఖర్‌గౌడ్, కార్యవర్గ సభ్యులుగా విక్రమ్‌రాగి, ఏవీరెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, కృష్ణ, కిరణ్, ప్రవీణ్‌రెడ్డి, నారాయణ ఎన్నికయ్యారు. వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. అసోసియేషన్ బలోపేతం చేయడానికి, క్రీడా స్ఫూర్తి పెంపొందించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఉత్పత్తి కేంద్రాన్ని పునరుద్ధరించాలి


అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నంలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పునరుద్ధరించాలని మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గౌరెంకల నర్సింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకన్న, నర్సింహ, రామచంద్రయ్యలు మాట్లాడుతూ.. ఉత్పత్తి కేంద్రాన్ని అన్యాయంగా కూల్చివేశారన్నారు. ఉచిత చేపపిల్లలకు బదులు ఖాతాల్లో నదు జమా చేయాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలన్నారు. చెరువులు, కుంటలకు శాటిలైట్ ద్వారా సర్వే నిర్వహించి, హద్దు రాళ్ల ఏర్పాటు చేయాల పేర్కొన్నారు. జంగయ్య, నరేష్ పాల్గొన్నారు.

సీఎం సోదరుడి పరామర్శ


రాములుతో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్లి రాములును సోమవారం ఆమనగల్లు పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుమల కృష్ణారెడ్డి పరామర్శించారు. రాములు మాతృమూర్తి జంగమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కాలె మల్లయ్య, కుమార్‌గౌడ్, కండె సాయి, శ్రీనునాయక్, రాంజ్య, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం


గెలుపొందిన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నాయకుడు ఆనంద్

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆనంద్

మహేశ్వరం: క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసికోల్లాసానికి దోహదపడతాయని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అబ్బేసి ఆనంద్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని గొల్లూరు గ్రామంలో గొల్లూరు ప్రీమియర్ లీగ్(జీపీఎల్) క్రికెట్ పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడలు ఆడడంతో శారీరక దృఢత్వం, మానసికోల్లాసం పెంపొందుతుందన్నారు. ప్రతిరోజు కొంత సమయాన్ని క్రీడలు, వ్యాయామం, యోగ, ధ్యానం, వాకింగ్‌కు కేటాయిస్తే ఆరోగ్యంగా ఉంటామన్నారు. క్రికెట్ పోటీల్లో రైజింగ్ స్టార్ జట్టు గెలుపొందగా, రన్నర్‌గా టీమ్ యాదగిరి జట్టు నిలిచాయి. అనంతరం గెలుపొందిన, రన్నర్‌గా నిలిచిన జట్లకు ట్రోఫీలను ఆయన అందజేశారు. అంతకు ముందు మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు క్రీడాకారులను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు శివకుమార్, విఘ్నేష్, భరత్, సూర్య, ప్రదీప్, యాదగిరి పలువురు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్


యువతకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ సుధాకర్

పహాడీషరీఫ్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ పేర్కొన్నారు. స్టేషన్ పరిధిలోని ఎర్రకుంటలో సోమవారం రాత్రి ఆయన వాహనాల తనిఖీలు చేపట్టి.. మాదక ద్రవ్యాల సోదాలు నిర్వహించారు. అనంతరం ఆయన వాహనదారులకు అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాల ద్వారా జీవితాలు నాశనం అవుతాయన్నారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. స్టేషన్ పరిధిలో ఇలాంటి వాటికి ఆస్కారం లేకుండా ముమ్మర తనిఖీలు చేపడుతామన్నారు. మత్తుకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయని హితబోధ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ జానీ తదితరులు పాల్గొన్నారు.

నేడు భూభారతి అవగాహన సదస్సు

కడ్తాల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన నూతన చట్టం భూభారతిపై మంగళవారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో అవగాహన సమావేశం నిర్వహించనున్నామని తహసీల్దార్ ముంతాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: మండల కేంద్రంలోని దేవకి గార్డెన్‌లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు భూ భారతి పోర్టల్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నామని తహసీల్దార్ నాగార్జున సోమవారం తెలిపారు. కార్యక్రమానికి మండల పరిధి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

పాలకేంద్రంపై చర్యలకు డిమాండ్

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని ఇందిరమ్మ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన పాల కేంద్రపై చర్యలు తీసుకోవాలని ఆ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నివాసాల మధ్య సెంటర్‌ను ఏర్పాటు చేయడం వలన శబ్దకాలుష్యంతో పాటు, దుర్వాసన వస్తోందని వాపోయారు. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఏడీఈకి ఫిర్యాదు

పాల కేంద్రం నిర్వాహకుడు 32 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ శాఖ సిబ్బంది సహకారంతో మూడు కనెక్షన్లు తీసుకున్నాడని, దీంతో లో ఓల్టేజి సమస్య తలెత్తి, నిత్యం ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాలనీ వాసులు ఆరోపించారు. ఈ మేరకు తుర్కయంజాల్ ఏడీఈకి ఫిర్యాదు పత్రం అందజేశారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత


చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని కిసాన్ మంచాల మండల అధ్యక్షుడు కావలి బుగ్గరాములు అన్నారు. మండల పరిధి ఆరుట్ల గ్రామానికి చెందిన బోద్రమోని మల్లయ్య, చీదేడ్ వాసి సంగం మహేశ్ ఆరోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు కోగా.. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో మల్లయ్యకు రూ.60 వేలు, మహేశ్‌కు రూ.45 వేలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు సోమవారం బాధితులకు చెక్కులు అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తుని తెలిపారు. కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, నాయకులు బాష, రమేష్, చంద్రయ్య ముదిరాజ్, సురేష్, జంగయ్య గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూలే సినిమా విడుదల పట్ల హర్షం


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ హక్కుల సాధన సమితి ప్రతినిధులు

నాగోలు: అన్ని అడ్డంకులను అధిగమించిన తర్వాత భారతదేశం అంతటా ఎట్టకేలకు పూలే సినియా థియేటర్లలో విడుదల పట్ల బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు, రాష్ట్ర సహాయ కార్య దర్శులు బొడ్డుపల్లి కృష్ణ, చింతకింది కుమారస్వామి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం నాగోలులోని ప్రజాసంఘాల కార్యాలయం ఎస్‌కే డాంగే భవన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. బ్రాహ్మణ సంఘాల అభ్యంతరాల మేరకు సీబీఎఫ్‌సీ దాదాపు 30 నిమిషాల సినిమాను కట్ చేసిందన్నారు. మహాత్మా జోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే ప్రారంభించిన సంఘ సంస్కరణ చరిత్ర నిజంగా ప్రశంసించదగినదని అన్నారు. సినిమా కట్స్ తర్వాత కూడా అద్భుతంగా చూడదగ్గదిగా ఉందన్నారు. దర్శకుడు ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దారని అన్నారు. ఈ సినిమా తీసిన దర్శక, నిర్మాతలకు అభినందనలు తెలియజేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ చూడాల్సిన సినిమా అని పేర్కొన్నారు.

వైభవంగా అష్టలక్ష్మి బ్రహ్మోత్సవాలు


అష్టలక్ష్మి దేవాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం, ఆర్‌కే పురం డివిజన్ పరిధిలోని వాసవీకాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో 29వ (ఏకోనత్రింషత్) ఇష్టి సహిత బ్రహ్మోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయంలో స్వామివారి పల్లకి సేవ, ఉత్సవారంభ స్నపనం, తదనంతరం మంగళ శాసనం కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సాయంత్రం సహస్ర నామస్తోత్ర పారాయణ, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, ఋత్విక్వరణ, మృత్సంగ్రహణ, అంకురారోపణ, ధ్వజపట అధివాసం, వైనతేయ ప్రతిష్ఠ, తిరుచ్చి పల్లకీసేవ లాంటి సేవలు నిర్వహిస్తామని వారు తెలిపారు. దేవాలయ ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మంచినీరు, మజ్జిగ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. ఆలయ చైర్మన్ సోమ సురేష్‌కుమార్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, కమిటీ సభ్యులు దాచేపల్లి శ్రీనివాసు, గౌరిశెట్టి అరుణ్ కుమార్, చిలుక ఉపేందర్‌రెడ్డి, ఉమాపతిరావు, సుదర్శన్, గ్రంథి రమేష్, మాలే శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తుర్కయంజాల్: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పురపాలక సంఘం పరిధి తొర్రూర్‌లో ఏర్పాటు చేసిన ఐకేపీ సెంటర్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్ చారి, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, రంగనాథ స్వామి ఆలయ చైర్మన్ అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు నిత్యం 700 లీటర్ల తాగునీటిని చలివేంద్రం ద్వారా పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆర్టీసీ డీఎం వెంకటనర్సప్ప, అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్, లయన్ క్లబ్ ప్రెసిడెంట్ సిహెచ్ నర్సింహ, సెక్రటరీ పి.బాలరాజ్, కోశాధికారి భీమ్‌రావు, సభ్యులు మహేశ్‌గౌడ్, వెంకటేశ్, మల్లేశ్ యాదవ్, సురేష్, జగన్, కేవీ రమేష్‌రాజు, మహేశ్, సుధాకర్, రవికుమార్, ఆర్టీసీ సిబ్బంది దుశ్శాసన, నర్సింహ, సదానందం, ఆంజనేయులు పాల్గొన్నారు.

పెద్ద వయస్సులోనూ టీకాలు అవసరం

- టీకాలతో సరికొత్త ఇన్‌ఫెక్షన్లు, వ్యాధుల నుంచి రక్షణ
- అంతర్జాతీయ టీకాల వారోత్సవాల సందర్భంగా కామినేని వైద్యుల సూచన



టీకాలపై అవగాహన కల్పిస్తున్న ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్ వైద్యులు

మన్సూరాబాద్: టీకాలు వేయించుకోవడం ప్రతి ఒక్కరికి అవసరమని.. వయస్సుతో సంబంధం లేకుండా టీకాలు వేయించుకోవాలని ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్ సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ ఎం. స్వామి, డాక్టర్ హరికిషన్, డాక్టర్ శ్రీకృష్ణ రాఘవేంద్ర, డాక్టర్ ప్రదీప్‌కుమార్ పటేల్ సూచించారు. హాస్పిటల్‌లోని ఇందిరా ఆడిటోరియంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 24 నుంచి 31వ తేదీ వరకు అంతర్జాతీయ టీకాల వారోత్సవాలను నిర్వహిస్తున్నామని వివరించారు. కోవిడ్ అనంతరం అనేక రకాల ఇన్ఫెక్షన్లు వస్తున్నాయని తెలిపారు. దీర్ఘకాలం రక్షణ పొందాలంటే టీకాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులు ఆయా విశ్వవిద్యాలయాలకు తప్పనిసరిగా కొన్ని టీకాలు తీసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. చిన్నతనంలో తీసుకున్న టీకాలను గుర్తించి పెద్ద వయస్సు వారికి టీకాలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. అన్ని వయస్సుల వారికి రోగ నిరోధకశక్తి అవసరమని తెలిపారు. గర్భిణులు ఉన్నప్పుడు ఒకరమైన టీకా, ఆ తర్వాత పరిస్థితులను బట్టి మహిళలకు టీకాలు ఇస్తామని స్పష్టం చేశారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ చద్రశేఖర్, వైస్ చైర్మన్ విజేందర్‌రెడ్డి

కందుకూరు: రైతులు ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని, దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ జి.విజేందర్‌రెడ్డి కోరారు. సోమవారం మండల పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏ–గ్రేడ్ రకం క్వింటాల్‌కు రూ.2320, కామన్ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.2300 ధర చొప్పున మద్దతు ధర ఉందన్నారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాల్‌కు అదనంగా మరో రూ.500 బోనస్ ఇవ్వనుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకొని ఆర్థికంగా ప్రయోజనం పొందాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు పి.ఆనంద్, ఎస్.నర్సింహ, జి.పర్వతాలు, ఎస్.పాండురంగారెడ్డి, ఎం.చంద్రు, ఏఓ లావణ్య, ఏఈఓ రాజు, పీఏసీఎస్ కార్యదర్శి ఎస్.యాదగిరిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే


గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులతో మాజీ ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది

కందుకూరు: అంగన్‌వాడీ కేంద్రాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచ్ జి.కలమ్మరాజు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆకులమైలారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీల ద్వారా చిన్నారులు, గర్భిణులకు తగిన పోషకాహారం అందుతుందన్నారు. అందరూ తమ పిల్లలను ముందుగా అంగన్‌వాడీల్లో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అందిస్తున్న పోషకాహారాలను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు కరుణాశ్రీసురేష్, అంగన్‌వాడీ టీచర్లు పుష్పలత, వనజ, లక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని, పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఇప్పల అంజయ్య ఆరోగ్య సమస్యలతో నగరంలోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చులు అధికమవడంతో బాధితుడి సమస్యను డీసీసీ.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే సహకారంతో సీఎం సహాయ నిధి నుంచి అంజయ్యకు రూ.2 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. ఈ మేరకు సోమవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, బీసీసెల్ మండల అధ్యక్షుడు యాదయ్య, నాయకులు మల్లేశ్‌గౌడ్, యాదగిరిరెడ్డి, రాజేశ్, షాబుద్దీన్, రవి, భానుకిరణ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి


వనస్థలిపురం రైతుబజారు వద్ద మే డే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

వనస్థలిపురం: దేశవ్యాప్తంగా మే 20న చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య పిలుపునిచ్చారు. సోమవారం వనస్థలిపురం రైతు బజారు వద్ద చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల సంఘం ఆధ్వర్యంలో మే డే పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ అధ్యక్షురాలు భారతమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు అతిథులుగా హాజరై పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. మే డే పోరాట స్ఫూర్తితో పెట్టుబడిదారులు, మతోన్మాద దోపిడీదారులు, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, రోజుకు 8గంటల పని, వారానికి 5రోజుల పని కోసం కార్మికులందరూ ఐక్య ఉద్యమం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వరలక్ష్మి, పాండు, రమేష్, చంద్రయ్య, కాశమ్మ, స్వరూప, సైదమ్మ, గుండారెడ్డి, కుటుంబరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మన్సూరాబాద్: అనునిత్యం కాలనీలలో పర్యటించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని – మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. డివిజన్ హయత్‌నగర్ పరిధి మోడీ బిల్డర్స్ పారడైజ్ అపార్ట్‌మెంట్స్‌లో సోమవారం పర్యటించారు. అపార్ట్‌మెంట్ వాసులు తమ సమస్యలను కార్పొరేటర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... చెత్తను సేకరించే ఆటోను అపార్ట్‌మెంటులోకి వచ్చేలా చర్యలు చేపడుతామన్నారు. వీధి కుక్కల బెడదను అరికడతామని పేర్కొన్నారు. అపార్ట్‌మెంట్ ఎదుట సీసీ రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్‌వాసులు వెంకటరత్నం, అయ్యప్ప, ప్రశాంత్, శ్రీనివాస్, వీరబాబు, శానిటేషన్ సిబ్బంది శ్రీనివాసరావు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వసతులు కల్పిస్తాం


సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బలాల, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్

మలక్‌పేట: ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తానని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. నల్లగొండ క్రాస్‌రోడ్‌లో ఉన్న ఆస్పత్రిలో సోమవారం అభివృద్ధి కమిటీ సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే హాజరై అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రికి కావాల్సిన వైద్య పరికరాలు కొనుగోలు చేయడానికి, అదనపు డయాలసిస్ మెషిన్ కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. మరమ్మతులు పనులు కూడా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాకర్ట్ సురేష్, అక్బర్‌బాగ్ కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, ఏఓ ఆంజనేయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.